# అమ్మా! నువ్వు నాకొద్దు

మేడ రెండో అంతస్తు గది కిటికీలో నుంచి కిందికి చూచాడు హరి. తమ బంగళాచుట్టూరా వున్న కాంపౌండ్ వాల్ అందంగా హుందాగా వుంది. గేటులోనుంచి రాగానే నేరుగా వున్న సిమెంటు చప్టా కిరువేపులా వున్న రకరకాల పూలమొక్కలూ, గిరగటాసి, బంగళాకే వింత సోయగాన్ని పంచిపెడ్తున్నాయి. కుడిప్రక్కగా వున్న ఫౌంటెన్ గిరగిర తిరుగుతూ నీళ్ళు చిమ్ముతోంది. ఎంతో ఆహ్లాదాన్ని అవన్నీ కలిగిస్తున్నాయని మనసును మళ్ళ పెట్టుకోవాలని ఎంతసేపుగానో ప్రయత్నిస్తున్నాడు హరి ఊహూఁ! ఆ కృత్రిమ అలంకారాలలో అందాలలో ఏవో మాలిన్యం ప్రస్ఫుటంగా కన్పిస్తోంది హరికి! అదేమిటి?

"హరీ!"

పరిచిత కంఠస్వరం విని తిరిగి చూచాడు హరి.


సురేఖ నిల్చునివుంది లేత ఆకుపచ్చ నైలాన్ చీరె, నల్లని వెల్వెట్ స్లీవ్‌లెస్ బ్లౌజూ, యౌవనాన్ని లాక్కురావాలనే కృత్రిమ ప్రయత్నంతో చేసుకున్న జుగుప్సాకరమైన అలంకరణ మరొక్కమారు పరీక్షగా చూచాడు తల్లివేపు. ముఖమంతా రంగు వేసుకుంది. పెదవుల లిప్‌స్టిక్ ఎర్రగా దుర్భరంగా వుంది చెవులకు వ్రేళ్లాడుతున్న రింగులూ, ముత్యాలూ, హరి హృదయాన్ని మరింతగా వూపుతున్నాయి - నొక్కుల నొక్కులజుట్టు అక్కడక్కడా ముఖం మీదికి వచ్చేలా లాక్కువి, పొట్టిగా ముందుకు వేసుకున్న రెండు జడలతో ఏదో కథలో చదివిన కామినీ పిశాచాన్ని గుర్తుకు తెస్తోంది

"ఏమిట్రా ఆ వెర్రిచూపు?" సురేఖ మందలిస్తూ, హైహీల్డ్స టకటక లాడిస్తూ, వచ్చి సోఫాలో కూర్చుంది.

"ఏమిటమ్మా ఈ వేషం?" ఎంతో ప్రయత్నంమీద ఉబికి వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ అడిగాడు హరి.

సురేఖ ఉలికిపడింది, కొడుకువేపు తీక్ష్ణంగా చూచింది. ఏమిటో ఎన్నడూ తనక్కలగని అభిమానమేదో అంతరాంతరాల్లోనుంచి వెలికివచ్చి, నరనరాన్నీ కలిపి వేస్తున్నట్లనిపిస్తోందామెకు. హరి అడిగిన ఆ ఒక్క ప్రశ్నతో, తల

పవని నిర్మలప్రభావతి




గురించైనా ఇలాగే పలువిధాలుగా విమర్శిస్తారు ప్రజలు. మంత్రులనూ, దేశనాయకులనూ విమర్శించటం లేదంటావా? అవన్నీ లెక్కకు తీసుకుంటే ఎలా బాబూ!"

"నిజమే నమ్మా! కానీ నిన్న నా పరిస్థితేమిటో వూహించుకో ఒక్క విషయం! చెల్లాయినీ అంతేనట వాళ్ళ స్కూల్లో! సినీతారకూతురివి: ఝామ్మని సినిమాల్లో చేరి, ప్రతిఒక్కడితో ప్రేమ ఘట్టాలు నటిస్తే సరిపోయే! నీకీ చదువెందుకమ్మా! మా కంఠశోష మినహా మరేముందీ?' అంటారుట మేడమ్స్ ఏ పొరబాటు జరిగినా!"

"అదంతా వాళ్ళ అక్కసు హరీ! అంతస్తులోనూ, కీర్తిలోనూ మనతో పరితూగలేరు! ఆ ఈర్ష్య నలా వెలిబుచ్చుతారు!"

"వాళ్ళ సంగతి వదిలెయ్యమ్మా! మా సంగతి చూడు! నా మటుకు నాకు విన్నాకొకసారి చూస్తుంటే అసహ్యం వేస్తుంది! మొన్న నోసారి కుమార్ ఇంటికి వెళ్లాను. కుమార్ తెలుసుగదూ నీకు?"

"చాలా పేదవాళ్ళని చెప్పావు! చాలామార్లు కాలేజి ఫీజుకూడా కట్టావు అతనికి? అతడే గదూ?"

"అవును! చాలా బీదవాళ్ళే! కానీ అతనికున్న ఏదో సంపద. ఏదో తృప్తి. ఏదో ఆనందం నాకు లేదనిపించా యీ క్షణంలో!"

సురేఖ పలకలేదు.

"'అమ్మా! ఇతడే నా స్నేహితుడు హరి! ఎన్నోమార్లు నన్నాదుకున్నాడమ్మా!'" అంటూ కేకేశాడు కుమార్. వాళ్ళమ్మ బయటికి వచ్చింది 'ఇలాగా నాయనా!' అంటూ కుతూహలంగా! నీ వయస్సే వుంటుందమ్మా ఆవిడ కూడా! దట్టమైన ముతకచీరే, రవికే ధరించింది. పమిటె నిండుగా కప్పుకుని

వుంది. గట్టిగా చుట్టిన జుట్టుముడితో, నుదుటను పెద్ద బొట్టుతో ఆమె అలా నా వేపు చూస్తుంటే, అమృతం వర్షించిన ట్లయిందమ్మా – ఎన్నోమార్లు నిన్ను చూస్తున్నాను. ఎప్పుడు చూచినా, ఏమిటోగా వుంటావు!"

సురేఖ చిన్నగా నవ్వబోయింది; కానీ ఎందుకో ఆమె కంఠంలో నుంచి నవ్వు సరళంగా రాలేక ఏదో అడ్డుపడి నట్లు ఆగిపోయింది; మెల్లిగా తనను తాను సంబాళించుకుంది ...

"చూడు హరీ! చిన్నవయసు! అనుభవం తక్కువ నీకు! ఆ వేళ మూ ఎక్కువే! నీకు గుర్తుందా? సరిగ్గా నీకు ఎనిమిదేళ్ళ వయస్సుంటుంది! దారిద్ర్యంతో క్రుంగిపోతున్న రోజు లవి బాబూ! నీకు బహుశా గుర్తు లేదేమో గానీ నాకు బాగా జ్ఞాపకం: కను మూసినా తెరిచినా ఈనాడా పీడకల లాంటి దృశ్యాలే కన్పిస్తాయి ఒక్కోసారి నాకు! గుండెజబ్బుతో మీనాన్న చని పోయారు. నువ్వూ, నీ చెల్లెలూ నేనూ! చుట్టూరా దారిద్ర్యపు గాఢాంధకారం. బంధువు లెవ్వరూ పట్టెడన్నం పెట్ట లేదు! ఎన్ని రోజులు పస్తులున్నామో! ఎంతటి నికృష్టపు జీవితం అనుభ వించామో తెలుసా?"

హరి మాట్లాడలేదు.

"ఎలాగో అదృష్టం వరించింది; నా అందాన్ని ఎరగా వేశాను నటనాచాతుర్యం చూపాను. బంతిని తన్నినట్లు పైకి వచ్చాను మీకూ, నాకూ ఏ లోటూ లేకుండా జీవితం ఆనందంగా గడిచి పోయేలా వసతి ఏర్పరచాను! దారి ద్ర్యపు ఛాయకూడా మనమీద సోకకుండా చూస్తున్నాను ... అందుకే వేషం వేస్తే తప్పేముందిరా!"

"అదే నీ పొరపాటమ్మా! దారి ద్ర్యాన్ని తరమగలిగావు. కానీ శాశ్వత మైన మాలిన్యాన్ని నీకూ, మాకూ కూడా పట్టించావు. పోనీ! ఇప్పుడు నువ్వు కోరిన స్థితికి వచ్చాంగదా? ఇంకా నీ ఈ వేష మేమిటి చెప్పు?"

సురేఖ దిమ్మెరపోయింది! ఏమని చెప్పాలి? అనేదే సమస్యయింది. "చూడు బాబూ! హరీ! సిరీ, కీర్తీ రెండూ మనం కోరినప్పుడు వచ్చేవి గావు! అవి వస్తున్నపుడు పిచ్చి కారణాలు చెప్పుకొని, నిరాకరించటం అవి వేకం! ఎలాగూ ఒక మార్గంలోకి అడు గెట్టాం! అలాగే సాగుదాం! ఇప్పుడు నే నేం తప్పు చేస్తున్నాననీ నీ బాధ? కళాసాధన చేస్తున్నాను ... కళామతల్లికి సేవ చేస్తున్నాను..."

"అంటే నీ కీ మార్గమే బాగుందం టావు! కానీ మరో నాలుగు రోజులు పోయాక అయినా నీ మార్గాన్ని మార్చు కోక తప్పదేమో!" అన్నాడు హరి కోపంగా.

"అంటే?"

"ఎంతో శ్రమపడినా నువ్విప్పుడు నీ అసలు వయసును దాచలేకుండా వున్నావమ్మా! మరికొన్ని రోజులు జరిగాక, నిర్మాతలూ, ప్రేక్షకులూ కూడా ఆమాట నీముందే చెప్పేస్తారు! అమ్మా ఎందుకీ శుష్కవాదన? ఎంత దారిద్ర్యంలో మగ్గినా, అనాడు నీకున్న గౌరవం వేరు! ఎంత పేరుప్రతిష్ఠలు సంపాదించినా ఈనాడు నీమీద అందరూ నిలుపుతున్న దృష్టి వేరు! 'నీ తల్లి ఫలానా:' అంటూ నలుగురూ నన్ను చూపిస్తుంటే, నన్ను నేను చంపుకోవాలనిపిస్తోందమ్మా!"

సురేఖ పలకలేదు!

"ఒకప్పుడు మా అమ్మ పేరు 'సుబ్బలక్ష్మమ్మ' అని చెప్పుకునేవాణ్ణి గర్వంగా! ఇప్పుడు 'సురేఖ' అనబోతే తడబడిపోతున్నాను ఒకప్పుడు వయసుకు దగ్గ నీ అలంకరణను చూచి చనువుగా నీ వడిలోకి పరుగెత్తుకు వచ్చేవాణ్ణి! ఇప్పుడెందుకో నిన్ను పరీక్షగా చూడాలంటేనే భయం వేస్తోందమ్మా!"

"చాల్లే వెధవ్వాగుడూ నువ్వూ! కాలేజి టైం కావస్తోంది కారు రెడీగా వుంది; వెళ్ళు హరీ! నాకూ షూటింగొకటుంది!" సురేఖ కారిన్యాన్ని అరువు తెచ్చుకుంటూ లేచి నిల్చుంది.

"అమ్మా!" హరి అరుపుకు రూము ప్రతిధ్వనించింది:

"నే వెళ్ళను; అంతేకాదు...ఇక ఒక్క క్షణంకూడా వుండనిక్కడ! నే వెళ్ళిపోతున్నాను!" అన్నాడు

"ఎక్కడికి?" గాభరాగా అడిగింది. సురేఖ!

"ఎక్కడికో! ప్రశాంతమైన ప్రకృతి తల్లి వడిలోకి వెళ్తాను! తన శీలసంపదతో, తన వయోరూప లక్షణాలతో, బిడ్డలను తన ఎదలో దాచుకుని రక్షించగల నీ తల్లి ఏనాడో చచ్చిపోయింది! ఇప్పుడున్న అమ్మ డబ్బు సంపాదించే ఒక యంత్రం! ఆ డబ్బుతోపాటు, తన బిడ్డకు అప్రదిష్ఠా, అవమానాలూ సమంగా పంచి ఇస్తున్న ఓ కృత్రిమ యౌవనరాశి! ఈ అమ్మ నాకొద్దు! అమ్మా నువ్వు నాకొద్దు:"

హరి గబగబా మేడ మెట్లు దిగి పరుగెత్తాడు. సురేఖ వారిద్దామనుకుని ఒక అడుగు ముందుకు వేసింది. కానీ ఏదో వత్తరశక్తి ఆమె నోరు పెగలనివ్వలేదు. ఎదురుగా నిలువుటద్దంలో కన్పించిన తన ప్రతిబింబాన్ని చూచి కలవరపడింది సురేఖ.

నెరసిన జుట్టుమడితో, ముడుతలవడ్డ ముఖంతో, కళావిహీనమైన వృద్ధాప్యంలో అడుగెట్టిన సుబ్బలక్ష్మమ్మ రూపం, తన రెండుజడల కేసి, చెవుల రింగుల కేసి, అన్నిటికంటే ఎక్కువగా తను ధరించిన బట్టలకేసి వేలు చూపిస్తూ విరగబడి నవ్వుతోంది అద్దంలో!

గమనిక. ఈ రచనలోని పాత్రలూ కథావస్తువూ, కేవలం కల్పితాలు!